క్లుప్తంగా

ధనుర్మాస ప్రత్యేక పూజలు



రెంటచింతల: వివిధ గ్రామాల్లోని దేవస్థానాల్లో ధనుర్మాసం సందర్భంగా సోమవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. రెంటాల శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో అర్చకులు శేషభట్టాచార్యులు, స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో అర్చకులు కృష్ణమాచార్యులు, తుమ్మకోట గ్రామంలోని జనార్దనస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు నేతృత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని, తమ మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. దేవస్థానం చైర్మన్లు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు



పిడుగురాళ్ల: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. న్యాయవాది బీవీ శేషాద్రి అనంతపురం మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనుచిత ప్రవర్తన కారణంగా ఆయన మృతి చెందారని నిరసన వ్యక్తం చేశారు. పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రామిరెడ్డి, కంభంపాటి కోటేశ్వరరావు, కావూరి జూలరావు, కోవూరి వెంకటేశ్వర్లు, ఆతుకూరి సీతారామయ్య, లోకేశ్వరి, వెలిశల రామకృష్ణ, ప్రశాంత్‌నాయక్, బెల్లంకొండ అచ్చారావు, మదాసు వెంకటేశ్వరరావు, సాగర్, నవ్య, అమాజ్ అహమద్, ఎస్వీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



మాచర్ల: మదర్ థెరిస్సా జీవితం అందరికి ఆదర్శణీయమని మాచర్ల మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, ఎంఈఓ ఎ.సురేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని మదర్ థెరిస్సా సేవా సమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ సేవ, దయ, కరుణ కలిగి ఉండాలని మదర్ థెరిస్సా ప్రజలకు తెలియజేశారన్నారు. మృతిచెందిన ఎంఈఓ కాంతారావుకు సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జి.కిరీటిరెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు జె.మల్రెడ్డి, న్యాయవాది సి.నాగిరెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.చంద్రయ్య, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఎ.శ్రీనివాసరావు, ఎం.పాపిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు, ఎ.బాలజోజి, కె.శాంతిరెడ్డి, ఎన్.భూషణాచారి, చెన్నకేశరెడ్డి పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మాచర్ల: పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం మున్సిపల్ కార్యాలయం హాలులో జరుగుతుందని కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ బి.వేణుబాబు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పది అంశాలపై కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంవత్సరం చివరి సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరవుతారని తెలిపారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



పిడుగురాళ్ల: పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎస్టీయూ నూతన సంవత్సర 2025 క్యాలెండర్‌ను గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు రామిరెడ్డితో పాటు ఎస్టీయూ కార్యవర్గ సభ్యులు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర ఉత్సాహం

- 2025 గ్రాండ్ వెల్‌కమ్ వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం
- ఈవెంట్‌లతో యువతలో జోష్
- వస్త్ర, బేకరీ, గృహోపకరణాల విక్రయాల్లో జోరు
- దేవాలయాలకు న్యూ ఇయర్ శోభ



న్యూ ఇయర్‌కు కేకులు సిద్ధం



పట్టణంలోని ఓ మాల్ వద్ద కొనుగోలుదారులకు ఆఫర్ గిఫ్ట్‌లు

పిడుగురాళ్ల: హ్యాపీ న్యూ ఇయర్. శుభాకాంక్షల్లోనే కాదు.. ప్రతి ఒక్కరి జీవితంలోనూ సంతోషం ఉండాలని నూతన సంవత్సర వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

డిసెంబర్ 31 అర్ధరాత్రి 11:59 నిమిషం దాటి..12 గంటల గంట ఎప్పుడు మోగుతుందా.. కొత్త సంవత్సరానికి ఎంత గ్రాండ్‌గా వెల్‌కమ్ చెబుదామా అని యువత ఎదురు చూస్తోంది. నూతన ఉత్సాహంతో కేరింతలు కొట్టేందుకు ప్రణాళికలు చేసుకుంటోంది. 2024కు సెండాఫ్ చెప్పేయ్యడానికి స్నేహితులతో సర్వం సిద్ధం చేసుకున్నారు.

ఆకర్షణీయమైన మోడలల్లో కేకులు...

ప్రతి ఒక్కరూ నూతన సంవత్సర వేడుకల్లో కేక్ కోసి, ఆనందాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. పలు రకాల మోడల్స్‌లో భారీ నుంచి కేజీ కేకు వరకు ఆర్డర్లు ఇచ్చేశారు. స్నేహితులతో, బంధువులతో కలిసి నూతన సంవత్సరం జరుపుకునేందుకు చూస్తున్నారు. దీంతో బేకరీ యాజమానులు కూడా యువతను ఆకట్టుకునేలా ఆకర్షణీయమైన కేకులను తయారు చేస్తున్నారు. కేక్ కొనుగోలు చేసిన వారికి కూల్ డ్రింక్స్ ఆఫర్ ఇస్తున్నారు.

మాల్స్ బంపర్ ఆఫర్లు

వినియోగదారులకు పట్టణంలోని వస్త్ర దుకాణాలు బంపర్ ఆఫర్లు ఇస్తున్నాయి. రూ.వెయ్యి నుంచి రూ.50 వేల వరకు కొనుగోలు చేసిన వారికి స్పాట్ గిఫ్ట్‌లను అందిస్తున్నాయి. దీంతో షాపింగ్ మాల్స్ వద్ద జనంతో కిటకిటలాడుతున్నారు.

విద్యుత్ అలంకరణతో దేవాలయాలు

నూతన సంవత్సర నిర్విఘ్నంగా సాగిపోవాలని, సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ప్రజలు ఉదయాన్నే దేవాలయాలకు వెళ్తారు. దర్శనం చేసుకుని దేవుడి ముందు తమ వినతులను ఉంచేందుకు భక్తులు ప్రార్థించనున్నారు. గురజాల నియోజకవర్గంలోని దైదా అమలింగేశ్వరస్వామి, పిడుగురాళ్ల గుత్తికొండ గ్రామ శివారులోని గుత్తికొండ బిలంలోని చీకటి మల్లయ్య, దాచేపల్లి భట్రుపాలెం, మోర్జంపాడు బుగ్గ మల్లేశ్వర స్వామి, పిడుగురాళ్ల పట్టణంలోని శివాలయం, కనక దుర్గమ్మ, వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయాలు విద్యుద్దీపాల వెలుగుల్లో వెలిగిపోతున్నాయి.

- రంగు రంగు పూలతో స్వామివార్లకు ప్రత్యేక దండలను, పూజల కోసం పుష్పాలను కొనుగోలు చేసి దేవుడి వద్దకు తీసుకొని వెళ్తారు. భవిష్యత్ ఏడాది మొత్తం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సంపూర్ణ ఆదాయంలో జీవితం సాగాలని దేవుడిని మొక్కుకోనున్నారు. పట్టణంలోని లూథరన్ చర్చి, తెలుగు బాప్టిస్ట్ చర్చి, ఆర్‌సీఎం చర్చి, హోసన్న మందిరంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు.

రంగవల్లులు..

మహిళలు ఇళ్లముందు వాళ్ల నైపుణ్యాన్ని చూపించాలని, అందరికంటే తమ ఇంటి ముందు రంగవల్లులు తీర్చిదిద్దేందుకు చూస్తున్నారు. ముగ్గుల్లోని రంగుల అమ్మకాలను చేసేవారు ఇప్పటికే పట్టణానికి చేరుకున్నారు. అమ్మకాలు చేస్తున్నారు.

3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించాలి



ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

రెంటచింతల: భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయని సావిత్రిభాయి పూలే జయంతి గౌరవార్థం జనవరి 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించాలని కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణపురం శ్రీనివాసరావు సోమవారం ఎంఈఓ–2 వై.శివ నాగేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సావిత్రి భాయి పూలే జయంతి సందర్భంగా 2018 లో అప్పటి ప్రభుత్వం జనవరి 3న ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించిందన్నారు. కరోనా కారణంగా కొన్ని సంవత్సరాలుగా వాయిదా వేయడం జరిగిందన్నారు. ఈ మంచి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరుద్దరించి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలలో ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారని ఘనంగా సన్మానించి సముచితంగా గౌరవించాలని ఆయన కోరారు. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఎంఈఓ శివ నాగేశ్వరరావు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మాచర్ల రూరల్: స్టేట్ టీచర్స్ యూనియన్ 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయమని హెచ్ఎం విజయ్ కుమారి అన్నారు. సోమవారం మండలంలోని కంభంపాడు జెడ్పీహెచ్ స్కూల్ ఎస్టీయూ, టీచర్స్ యూనియన్ నేతృత్వంలో 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా జిల్లా మైనార్టీ కన్వీనర్ షేక్ అబ్దుల్ జబ్బార్ సొంత నిధులతో మెటీరియల్ అందించినట్లు చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్‌బాబు అభినందనలు తెలిపారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు జాన్, కార్యదర్శి నాగరాజు, జిల్లా కౌన్సిలర్లు పి అన్వర్‌ఖాన్, మధుసూదనరావు, ఉపాధ్యాయులు నాగమురళి, హనుమారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.అలాగే మాచర్ల జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలకు పూర్వ ఉపాధ్యాయుడు బుయ్యనప్రగడ వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ సంఘ నాయకులు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.రామారావు, యూటీఎఫ్ నాయకులు ఉన్నారు.

అమిత్ షాను వెంటనే అరెస్టు చేయాలి



పిడుగురాళ్ల పట్టణంలో ర్యాలీ



నిరసన తెలియజేస్తున్న వామపక్షాల నాయకులు

పిడుగురాళ్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోం శాఖ మంత్రి అమీత్‌షాను చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ.. పట్టణంలోని బ్యాంక్ సెంటర్ నుంచి పిల్లుట్ల రోడ్డులోని అంబేద్కర్ బొమ్మ వరకు సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ పార్టీలు, బీసీ, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అమిత్ షాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ నాయకలు పాల్గొన్నారు.

మాచర్ల: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని మాచర్ల ఏరియా సీపీఎం కార్యదర్శి బండ్ల మహేష్ డిమాండ్ చేశారు. వామపక్షాల ఆధ్వర్యంలో అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా దేశ వ్యాప్త పిలుపులో భాగంగా పట్టణంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మహేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సహించరాని నేరమన్నారు. ర్యాలీలో సీపీఎం నాయకులు కె.వెంకటరత్నం, శ్రీను పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ.. కత్తితో దాడి



కత్తిదాడిలో సూర్యకు గాయం

పిడుగురాళ్ల: ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి కత్తులతో దాడి చేసుకొని పలువురికి గాయాలైన ఘటన పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పిడుగురాళ్ల పట్టణానికి చెందిన జెమినీ అలియాస్ రామకృష్ణ, ప్రసాద్ ఇద్దరు కొండమోడు సమీపంలోని దేవరంపాడు వద్ద ఓ హోటల్‌లో మద్యం సేవిస్తున్నారు. అదే క్రమంలో సూర్య, అతని స్నేహితుడు పవన్‌లు మద్యం సేవించేందుకు ఆదే హోటల్ వద్దకు వెళ్లారు. ఈ క్రమంలోనే అందరు స్నేహితులే కావటంతో ప్రసాద్, పవన్‌లకు మాటమాట పెరిగి గొడవగా మారింది. ఈ గొడవలో జెమినీ అనే వ్యక్తి పవన్‌పై చెయ్యి చేసుకున్నాడు. తప్పు అని తెలిసి పవన్‌కు జెమినీ క్షమించమని చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ఈ లోగా జెమినీ పిడుగురాళ్ల పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావుకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. ఆయన రాజుపాలెం పరిధిలో ఉంది కాబటి రాజుపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి అని చెప్పారు. తామంతా పిడుగురాళ్ల పట్టణ వాసులమే అని చెప్పడంతో పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌కు రమ్మని సీఐ తెలిపారు. పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్‌కు వద్దకు ఇరువర్గాల వారి వారి అనుచరులను తీసుకొని పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చారు. ఇదంతా గమనించిన ఓ టీడీపీ నాయకుడు గొడవ పడినవారు అందరు స్నేహితులే కదా అని కేసులు లేకుండా సర్ది చెబుదామని ప్రయత్నించాడు. అతని మాటలు విని ఇరువర్గాలు పోలీస్ స్టేషన్ నుంచి పిలుట్ల రోడ్డువైపు వెళ్లారు. తిరిగి కొంత సమయానికి పోలీస్ స్టేషన్ సమీపానికి వచ్చారు. జెమినీ వైపు వచ్చిన టీ కొట్టు వాసు అక్కడ మద్యం తాగి ఆటో వాలా సూర్య, అతని స్నేహితులపై గొడవకు దిగాడు. అంతటితో ఆగకుండా గొడవ పడుతూనే పిల్లుట్ల రోడ్డులోని ఓ చికెన్ పకోడి బండి వద్ద ఉన్న కత్తిని తీసుకొని విచక్షణ రహితంగా అడ్డువచ్చిన వారిపై దాడి చేశాడు. ఈ దాడిలో సూర్య మెడ, చేతికి కత్తి గాయాలు అయ్యాయి. దీంతో తీవ్ర రక్త స్రావం అయింది. పాల్ అనే వ్యక్తికి కూడా మెడకు కత్తికి గాయమైంది. రక్తపు మడుగులో ఉన్న వీరిని చూసి సుధాకర్, పవన్, సురేష్, గోపిలు కత్తితో దాడి చేసిన వాసుపై రాళ్ల దాడి చేశారు. ఈ రాళ్ల దాడిలో వాసు కూడా తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. వెంటనే సంఘటనా స్థలానికి పట్టణ ఎస్ఐ మోహన్‌చేరుకొని ఇరువర్గాల వారిని అదుపులోకి తీసుకొనే ప్రయత్నం చేశారు. అయితే గాయపడిన సూర్యను పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో, వాసును నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించినట్లు సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు.. ప్రస్తుతం ప్రాణాపాయం లేదని సీఐ తెలియజేశారు. ఈ ఘటనపై జెమినీ వర్గమైన జెమినీ, వాసు, ప్రసాద్‌లపై కేసు నమోదు చేశారు. జరిగింది. మరో వర్గమైన సూర్య, సుధాకర్, పవన్, సురేష్, గోపీలపై పట్టణ ఎస్ఐ మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు.

సైబర్ నేరాగాళ్లతో తస్మాత్ జాగ్రత్త!

- యడ్లపాడు వాసులిద్దరికీ బెదిరింపు కాల్స్
- టోల్‌ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేసిన బాధితులు

యడ్లపాడు: క్రెడిట్ కార్డుపై తీసుకున్న బాకీ తక్షణమే తమకు చెల్లించకుంటే అరెస్టు వారెంట్ జారీ చేయాల్సి ఉంటుందని సైబర్ నేరగాళ్లు బెదిరింపులకు గురి చేసిన ఘటనలు ఆలస్యంగా వెలుగు చూశాయి. సదరు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... యడ్లపాడు గ్రామానికి చెందిన వీరాంజనేయులుకు ఈనెల 25న యడ్లపాడుకు చెందిన వీరాంజనేయులుకు ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం గుర్తు తెలియని వారి నుంచి వీడియో వాట్సప్ కాల్ వచ్చింది. ముందు హిందీలో మాట్లాడిన సదరు కాలర్ తర్వాత తెలుగులోనూ సంభాషణను కొనసాగించాడు. స్టేట్‌బ్యాంకు క్రెడిట్ కార్డు బాకీ రూ.1,06,965 చెల్లించలేదని అరెస్టు వారంట్ ఉందని వెంటనే నగదు చెల్లించాలని వీరాంజనేయులు బెదిరించాడు. వెంటనే తనకు ఆధార్‌కార్డు పంపాలంటూ బలవంతంగా వాట్సప్‌కు పెట్టించుకున్నాడు. అనుమానం వచ్చిన వీరాంజనేయులు తాను ఇటీవల ఎస్‌బీఐలో క్రెడిట్‌కార్డుకు కోసం దరఖాస్తు చేశానని, అయితే కార్డు ఇంకా తనకు ఇవ్వలేదని సమాధానం చెప్పాడు. కాబట్టి తాను ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదంటూ చెప్పి కాల్ కట్ చేశాడు. అనంతరం వీరాంజనేయులు వాట్సాప్‌కు ఫోటోతో కూడిన నకిలీ ఆధార్‌పత్రం పంపించాడు. సదరు ఘటనపై అదేరోజు టోల్‌ఫ్రీ నంబర్ 1903కు డయల్ చేసి ఫిర్యాదు చేశాడు. ఇటీవల ఇదే తరహాలో యడ్లపాడుకు చెందిన రమణకు ఇదే తరహా సైబర్ కాల్ వచ్చినట్లు తెలిపారు. ఈ విషయంపై యడ్లపాడు ఎస్ఐ వి.బాలకృష్ణ స్పందిస్తూ నిత్యం సైబర్ మోసగాళ్లు ఇదే తరహాలో ఎక్కువగా మోసాలకు పాల్పడుతున్నారని, వీటిపై ప్రతి సెల్‌ఫోన్లలోనూ ప్రచారం జరుగుతుందన్నారు. ప్రజలు తమకు తెలియని వారికి ఎవ్వరికీ వాట్సప్, సోషల్ మీడియాల్లో తమకు సంబంధించిన ఆధారాలు, సమాచారం ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

రైతులను 'రెవెన్యూ' ఇబ్బంది పెడుతోంది!

- పిచ్చుకలపాలెం ఇన్‌చార్జి వీఆర్వోపై చర్యలు తీసుకోండి
- ఆర్డీవోకు ప్రజాసంఘాల వినతి



ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారికి వినతి పత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: శావల్యాపురం మండలం పిచ్చుకలపాలెం రెవెన్యూ ఇన్‌చార్జి వీఆర్వోగా వ్యవహరిస్తున్న కనుమలపూడి వీఆర్వో నరసింహారావుపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు ఆర్డీవోను కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో పోస్టర్లు ప్రదర్శించి పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు మాట్లాడుతూ సమస్యలు చెప్పుకోవడానికి వెళ్లిన రైతుల పట్ల శావల్యాపురం తహసీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వీఆర్వో నరసింహారావు రెవెన్యూ సదస్సులో అర్జీలు ఇచ్చిన రైతులను పెద్ద మొత్తంలో ఖర్చులు అవుతాయని, రకరకాల కారణాలు చెప్పి డబ్బులు ఇచ్చిన వాళ్లకే పరిష్కారం చేస్తామని, లేకపోతే లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు.

మండలంలో వీరు చెప్పిందే రెవెన్యూ చట్టంలా అధికారులు, నరసింహారావు వ్యవహరిస్తున్నారని అన్నారు. గాలి వెంకటేశ్వర్లు అనే రైతుకు చెందిన 45 సెంట్ల భూమిని సీతయ్య అనే అతను రెవెన్యూ వాళ్ళతో కుమ్మక్కై ఆన్‌లైన్ చేయించుకుని వేరే వాళ్లకు అమ్ముకున్నాడని, దీనికి శావల్యాపురం మండల రెవెన్యూ అధికారులే కారణమని ఆరోపించారు. అలాగే రీ–సర్వేలో అనేక లోపాలు జరిగాయని, ఒకరి భూములు మరొకరికి ఎక్కించడం జరిగిందన్నారు. రిజిస్ట్రేషన్ క్యాన్సిలేషన్ చేసుకున్న వారి వివరాలు ఆన్‌లైన్ చేయాలంటే డబ్బులు ఇస్తేనే, లేకపోతే లేదంటూ అర్జీదారులను ఆఫీసుల చుట్టూ తిప్పిన చరిత్ర నరసింహారావుదన్నారు. గతంలో ఇతను అనేకసార్లు సస్పెండైనా ఇతని వైఖరిలో మార్పులేదని, ప్రభుత్వం అధికారులు వెంటనే వీఆర్వో నరసింహారావు, రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, పౌర హక్కుల సంఘం నాయకులు చికినం చిన్న, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు మూడు అర్జీలు

రొంపిచర్ల: మండలంలోని అలవాల గ్రామ సచివాలయంలో సోమవారం గ్రామ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సుకు ఇద్దరు రైతులు తమ పొలాన్ని సబ్ డివిజన్ చేయించాలని అర్జీ అందజేయగా, ఆన్‌లైన్ అడంగల్‌లో తమ భూములు నమోదు చేయించాలని మరో రైతు అర్జీ అందజేశారు. ఈ సదస్సులో ఆర్ఐ కోటేశ్వరరావు, మండల సర్వేయర్ రవికుమార్, విలేజ్ అసిస్టెంట్ వెంకట్రావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేజరు కాల్వ పరిశీలించిన డీసీ చైర్మన్

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని త్రిపురాపురం మేజరు కాలువను చైర్మన్ గంగినేని రాఘవరావు ఎన్నెస్పీ అధికారులు సోమవారం సందిర్శించారు. ఈసందర్భంగా డీసీ చైర్మన్ రాఘవరావు మాట్లాడుతూ కాలువ రహదారి మార్గంలో ఉన్నటువంటి గుంతలు మరమ్మత్తులు చేపట్టి రైతులకు సౌకర్యంగా ఉండేలా అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాల్వ వెంట నడకదారి మర్గాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు కంభంపాడు ఉప సర్పంచ్ మేదరమెట్ల అనిల్‌కుమార్,గోవిందయ్య, రామారావు, ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



విజయపురిసౌత్: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ వీఏఏ శ్రీమల్లి అన్నారు. సోమవారం నాగులవరం గ్రామంలో చింతల తండా యూనిట్ మహిళా రైతు జె.అనంత లక్ష్మి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా సాగు చేసిన ఆకుకూరలు, కూరగాయలను స్థానిక సచివాలయం వద్ద స్టాల్స్ లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా వీఏఏ శ్రీమల్లి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.ప్రతి సోమవారం సేంద్రియ సాగువిధానం లో పండించిన కాయకూరలు, ఆకుకూరలను స్థానిక సచివాలయం వద్ద విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది సీతారామయ్య, మండల కృష్ణ, సరిత,భారతి తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతలలో బైక్ ర్యాలీ

రెంటచింతల: మండలంలోని యూటీఎఫ్ ఉపాధ్యాయులందరూ జనవరి 5 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహా సభలను జయప్రదం చేయాలని మండల అధ్యక్షుడు సీహెచ్ నాసరయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన బైక్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గోడ ప్రతులను ఆవిష్కరించారు. రాజ్‌కుమార్, ఓర్సు సాగర్‌బాబు, ఎంబీ చిన్నమ్మ, బిల్లా ప్రతాప్ పాల్గొన్నారు.

మెడికల్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు మెడికల్ దుకాణాలపై డ్రగ్ విజిలెన్సు అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. డ్రగ్ విజిలెన్స్ అధికారి ఇ.సాంబశివరావు మాట్లాడుతూ...నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే నార్కొటిక్ మందులను విక్రయించవద్దని స్పష్టం చేశారు. వినియోగదారుడికి ఖచ్చితంగా బిల్లులను అందించాలని సూచించారు. లేని పక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ దాడుల్లో పిడుగురాళ్ల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సునిత, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణతోనే మాదిగ ఉప కులాలకు మేలు



రెంటచింతల: ఎస్సీ వర్గీకరణ చేయడం వల్ల దేశంలోని 58 మాదిగ ఉపకులాలకు మేలు జరుగుతుందని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాచర్ల ఇన్‌చార్జి గడ్డిపర్తి శ్రీనివాసరావు సోమవారం సీఎం చంద్రబాబు నియమించిన ఏకసభ్య కమిషన్ శ్రీరాజీవ్ రంజన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వినతిపత్రం అందజేయడం జరిగిందాన్నరు. ఎస్సీ వర్గీకరణ చేయని కారణంగా గత 70 సంవత్సరాలుగా 58 మాదిగ ఉపకులాల వారు విద్య, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ రంగాలలో తీవ్రంగా నష్టపోతున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట ఎంఆర్పీస్ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కందుకూరి రమేష్, ఎంఎస్పీ, ఎంఆర్పీస్ నాయకులు టి. మరియబాబు మాదిగ, టి. జీవరత్నం మాదిగ, పి. అన్నారావు మాదిగ, యు. మార్క్ మాదిగ, రూబెన్ మాదిగ తదితరులున్నారు.

రైతు శ్రేయస్సు కోసం..

మాచర్ల రూరల్: రైతులకు పెట్టుబడులు తగ్గించి లాభాలు పెంపొందించేందుకు ఎస్ఎంఎల్ కంపెనీ నూతన ఉత్పత్తులను రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఉపాధ్యక్షుడు జీవీ సూర్యనారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని నిదానంపాటి గ్రామంలో నూతన ఉత్పత్తులను విడుదల చేసి మాట్లాడారు. ఆధునిక, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు తీసుకొచ్చేందుకు ఈ ఉత్పత్తులు ఎంతగానో ఉపయోగపడతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ పీవీ రాజశేఖర్‌రెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ



విజయపురిసౌత్: నరసరావుపేట లో నిర్వహించిన బాలోత్సవంలో మాచర్ల మండలంలోని ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. సీనియర్స్ జానపద నృత్యంలో పాఠశాల విద్యార్థినులు ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. రంగవల్లుల్లో వై.అంకిత మూడవ స్థానం లో నిలిచింది. జూనియర్స్ జానపద నృత్యంలో కన్సొలేషన్ బహుమతి, శాస్త్రీయ నృత్యం సీనియర్స్ విభాగంలో అంకిత గ్రూపుకు కన్సొలేషన్ ప్రైజ్ లను గెలుచుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం జి.దుర్గాభవాని, ఉపాధ్యాయులు నాగ మల్లేశ్వరి, ఎలిజిబెత్ రాణి, సుగంధ అభినందించారు.